# సాక్షి వికారాబాద్

మంగళవారం ၊ 18 ၊ జూలై ၊ 2023







## ఇంటి పైకప్పు కూలి..

పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో ఓ ఇంటి పైకప్పు కూలి తల్లితో సహా ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి.

8లో▸



## అభివృద్ధిలో ఉద్దండా'పూర్'

తెలంగాణ – కర్ణాటక సరిహద్దులో ఉండడంతో ఉద్దండాపూర్ అభివృద్ధికి నోచుకోవడం లేదు.

8లో▸



## 'అధిక ధర'ల దరువు

ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా కొంతమంది వ్యాపారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారు.

9లో▸

## న్యూస్‌రీల్

### ఆలయ నిర్మాణానికి నిధులివ్వండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: మండల పరిధిలోని ఖుదావన్‌పూర్ వీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి, వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అవసరమైన నిధుల కేటాయింపునకు సహకారం అందిస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్ గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సుబ్బారెడ్డి, బాలరాజు, శ్రీనివాస్, యాదయ్య, కృష్ణయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు.

### ఎస్పీని కలిసిన డీఎస్పీ



ఎస్పీకి బొకే అందజేస్తున్న డీఎస్పీ

అనంతగిరి: వికారాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కె.నరసింహులు సోమవారం ఎస్పీ కోటిరెడ్డిని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకేను అందజేశారు.

### బస్సుపై యువకుల రాళ్లదాడి

ధారూరు: ఆర్టీసీ బస్సుపై కొందరు యువకులు రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటన మండలంలోని రాంపూర్‌తండా వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు రాంపూర్ తండా వద్దకు రాగానే ముగ్గురు యువకులు ఆపే ప్రయత్నం చేశారు. బస్సును ఆపకపోవడంతో రాళ్లతో దాడి చేశారు. దీంతో డ్రైవర్ స్థానిక పీఎస్‌కు వచ్చాడు. దాడికి పాల్పడిన యువకులు కూడా స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసుల రాకను గుర్తించి అక్కడి నుంచి పారిపోయారు. నిందితుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కాళికాదేవికి పల్లకీ సేవ

బోనాల పండుగలో భాగంగా సోమవారం కాళికాదేవికి పల్లకీ సేవ నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల నృత్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సంబరాల్లో పాల్గొని పల్లకీ మోశారు. కాంగ్రెస్ నేత రమేశ్ మహరాజ్, బీజేపీ కౌన్సిలర్ లావణ్య తదితరులు జగన్మాతను దర్శించుకున్నారు.

– తాండూరు టౌన్



పల్లకీ సేవ ఊరేగింపులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ నేతలు, భక్తులు

## ప్రత్యేక పూజలు

దామర్‌చెడ్‌లోని భవానీనగర్‌లో వెలసిన అంబాభవానీ మాతకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం తాండూరు నియోజకవర్గంలోని భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పీఠాధిపతి, తెలంగాణ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీశంకర్‌స్వామీజీ ప్రవచనాలు చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు.

– బషీరాబాద్



భక్తులకు దర్శనమిచ్చిన భవానీమాత

# దళితబంధు - 2

- రెండో విడత పథకం అమలుకు అధికారుల చర్యలు
- జిల్లాకు 3,962 యూనిట్లు మంజూరు
- లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలు బిజీ



దళితబంధు పథకంలో భాగంగా నిర్మించిన పౌల్ట్రీ ఫారాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు (ఫైల్)

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం మొదటి విడత ఇప్పటికే పూర్తవగా, రెండో విడతకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. మొదటి విడతలో అరకొరగా యూనిట్లు మంజూరు చేయడంతో అటు లబ్ధిదారులు, ఇటు ఎమ్మెల్యేలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండో విడత పథకం అమలుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. మొదటి విడత కింద జిల్లా వ్యాప్తంగా 358 మందికి పథకాన్ని వర్తింపజేశారు. రెండో విడతలో ఒక్కో నియోజకవర్గానికి 1,100 మందిని ఎంపిక చేయాలని ప్రభుత్వం సూచించడంతో ఎమ్మెల్యేలు ఆ పనిలో ఉన్నారు. రెండో విడతలో జిల్లాకు 3,962 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో వికారాబాద్, తాండూరుకు 1,100 చొప్పున కేటాయించారు. పరిగి నియోజకవర్గ పరిధిలోని మన జిల్లాలో ఉన్న మండలాలకు 881 యూనిట్లు, కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మన జిల్లాలో ఉన్న మండలాలకు 661 యూనిట్లు, నవాబుపేట మండలానికి 220 యూనిట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు.

**50వేల మంది జనాభా**

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 39,749 దళిత కుటుంబాలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. జనగణన నిర్వహించి దశాబ్దకాలం గడుస్తున్న నేపథ్యంలో మండలాలు, గ్రామాల వారీగా దళితుల కుటుంబ సర్వే చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా జిల్లాలో 1.8 లక్షల జనాభా, 50 వేల పైచిలుకు కుటుంబాలు ఉన్నాయని దళిత సంఘాల సర్వేలు పేర్కొంటున్నాయి. అందరికీ పథకం వర్తింపజేయాలంటే జిల్లాకు రూ.5 వేల కోట్లు అవసరమని తెలుస్తోంది.

**ఎమ్మెల్యేల కటాక్షం కోసం..**

ఇప్పటి వరకు దళితబంధు విషయంలో తీవ్ర విమర్శలు చెలరేగాయి. ప్రభుత్వం కేవలం మొదటి విడతకే పరిమితమవుతుందని, రెండో విడత ప్రారంభమైనా ఆలోపు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి లబ్ధిపొందాలని భావిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయమై దళిత సంఘాలు సైతం ప్రభుత్వ తీరును అనుమానిస్తున్నాయి. కానీ యూనిట్లు ఎక్కువగా మంజూరు చేసిన నేపథ్యంలో ఆశావహుల్లో అంచనాలు పెరిగిపోయాయి. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను ఎమ్మెల్యేలకు కట్టబెట్టడంతో ఆశావహులు వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే దళితబంధు కావాలంటే బీఆర్‌ఎస్‌లో చేరాలని ఎమ్మెల్యేలు సూచిస్తున్నట్లు తెలుస్తోంది.

### ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది



దళితుల అభ్యున్నతి కోసం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఎలాంటి అవకతవకలు, ఇబ్బందులు లేకుండా మొదటి విడత పూర్తిచేశాం. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని అనుమానించాల్సిన అవసరం లేదు. రెండో విడత పెద్ద మొత్తంలో యూనిట్లు మంజూరయ్యాయి. విడతల వారీగా ప్రతీ దళిత కుటుంబానికి పథకం అందాలనేదే సీఎం కేసీఆర్ లక్ష్యం.

– మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే, వికారాబాద్

## ప్రైవేట్ ఆస్పత్రిలో షార్ట్‌సర్క్యూట్

షాద్‌నగర్‌రూరల్: ప్రైవేట్ ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి సకాలంలో చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటన పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పరిగి రోడ్డులోని షాద్‌నగర్ సూపర్ స్పెషాలిటీ (ప్రైవేట్) ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఐసీయూ విభాగంలో దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఆస్పత్రిలో ఉన్న వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో మంటలు అదుపులోకి రావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

యువకుడి దుర్మరణం

మొయినాబాద్: అతివేగంతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఓ యువకుడి ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శిరీష తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, బీరంగూడకు చెందిన భాస్కర్(29) ఆర్‌సీపురంలో బేకరీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఉదయం 9గంటల ప్రాంతంలో తన బుల్లెట్ బైక్‌పై మెయినాబాద్ నుంచి మెహదీపట్నం వైపు ప్రయాణిస్తున్నాడు. తాండూరు నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను వేగంగా ఢీ కొట్టింది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడగా భాస్కర్ బస్సు వెనుక చక్రాల కిందపడిపోయాడు. అతని తలపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**మొయినాబాద్ వైపు ఎందుకొచ్చాడు..?**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భాస్కర్ మొయినాబాద్‌కు ఎందుకు వచ్చాడో అంతుచిక్కడంలేదు. ఆర్‌సీ పురంలో బేకరీ మేనేజర్‌గా పనిచేసే భాస్కర్ ఆదివారం రాత్రి ఇంటికి రాలేదని... అతనికి ఫోన్‌చేసినా కలవలేదని.. అసలు మొయినాబాద్‌కు ఎందుకొచ్చాడో తమకు తెలియదని వాపోయారు.



లాల్‌దర్వాజా సింహవాహినిణి ఆలయం వద్ద భక్తజన సందోహం



# ఘటం.. ఘనం

బోనాల వేడుకల్లో భాగంగా సోమవారం పాతబస్తీ చార్మినార్ ప్రధాన వీధుల్లో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అక్కన్న మాదన్న మహంకాళీ దేవాలయం అమ్మవారి ఘటం అంబారిపై ఊరేగింపులో ముందు వరుసలో ఉండగా..మిగిలిన ప్రధాన దేవాలయాల ఘటాలు వెనుక అనుసరించాయి. ఇక ప్రధాన దేవాలయాల్లో భవిష్యవాణి కార్యక్రమం జరిగిన అనంతరం సామూహిక ఊరేగింపు భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. రంగురంగుల శకటాలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు, పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఊరేగింపు ఉప్పుగూడ, బేలా, గౌలిపురా, శాలిబండ, కోట్ల అలీజా, మీరాలంమండి, కోట మైసమ్మ, కసరట్ట తదితర ప్రాంతాల నుంచి చార్మినార్ మీదుగా నయాపూల్‌లోని మూసీ నది వరకు కొనసాగింది. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.

– చార్మినార్





శివ ఘటం...



చార్మినార్ వద్ద ఏనుగు అంబారీపై అమ్మవారి ఊరేగింపు

## భార్య కాపురానికి రావడం లేదని..

- వ్యక్తి ఆత్మహత్య
- తాండూరు మండలం గౌతపూర్‌లో ఘటన
- మృతుడు కర్ణాటకవాసి

తాండూరు రూరల్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి విద్యుత్ తీగను పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గౌతపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చితాపూర్ తాలుకా గవూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ జబ్బార్ (50) పాలిషింగ్ యూనిట్లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో గొడవపడి నాలుగు రోజుల క్రితం సోదరుడైన గౌస్ పనిచేసే పాలిషింగ్ యూనిట్ వద్దకు వచ్చాడు. ఉన్నట్టుండి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్‌ను పట్టుకోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం కర్ణాటకకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆటలు పక్కా

- త్వరలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు
- కరోనా నేపథ్యంలో మూడేళ్లుగా ఆగిపోయిన క్రీడలు
- ఆగస్టు నుంచి నిర్వహణకు షెడ్యూల్ ఖరారు
- ఆనందంలో విద్యార్థులు



క్రీడల్లో పోటీ పడుతున్న చిన్నారులు

వికారాబాద్ అర్బన్: కరోనా మహమ్మారి కారణంగా మూడేళ్లుగా ఆగిపోయిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను త్వరలోనే నిర్వహించనున్నారు. పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పోటీలు నిర్వహిస్తున్నాయి. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్– 14, అండర్– 17, అండర్– 19 విభాగాల్లో మండల, జిల్లా స్థాయిలో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో సత్తాచాటిన వారిని జోనల్, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు.

**మొదలు కానున్న సందడి**

ఈ ఏడాదికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తున్న నేపథ్యంలో గేమ్స్ నిర్వహణపై దృష్టి సారించారు. పోటీల వివరాలను ప్రకటించారు. గతంలో ఏటా జూలై, ఆగస్టులో జిల్లా స్థాయి, సెప్టెంబర్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేవారు. ఆతర్వాత జాతీయ స్థాయి టోర్నీలు ఏర్పాటు చేసేవారు. దీనికి ముందే జిల్లాలోని పీడీలు, పీఈటీలతో ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసి సెలెక్షన్స్ తేదీలను ప్రకటించేవారు. కానీ మూడేళ్లుగా క్రీడలు నిర్వహించకపోవడంతో పాటు, ఇప్పటికే ఆలస్యమైన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగా షెడ్యూల్‌ను ప్రకటించారు. త్వరలోనే పీడీ, పీఈటీల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను ప్రకటించే అవకాశం ఉందని ఆ సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ఎస్‌జీఎఫ్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు మొదటి వారం నుంచి సెప్టెంబర్ నాలుగో వారం వరకు నాలుగు దశల్లో క్రీడలు నిర్వహించనున్నారు. మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా(జోనల్), రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ముందుగా కొత్త జిల్లాల స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించి, ఇందులో నైపుణ్యం కనబర్చిన వారితో ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక జట్టును ఎంపిక చేయాల్సి ఉంటుంది. వీరు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారు. ఎస్‌జీఎఫ్ షెడ్యూల్ రావడంతో పాఠశాల, కళాశాల స్థాయిలో సందడి నెలకొంది. ఇటీవలే స్పోర్ట్స్ స్కూల్స్ కోసం మండల, జిల్లా స్థాయిలో ఎంపికలు జరిగాయి.

| క్రీడలు | నిర్వహించే నెల |
|---|---|
| మండల స్థాయి పోటీలు | ఆగస్టు మొదటి, రెండో వారం |
| జిల్లా పోటీలు | ఆగస్టు మూడో వారం |
| ఉమ్మడి జిల్లా స్థాయి | సెప్టెంబర్ రెండో వారంలో టోర్నీ కమ్ సెలెక్షన్స్ |
| రాష్ట్ర స్థాయి పోటీలు(పాత జిల్లా) | సెప్టెంబర్ చివరిలో |

**నిర్వహించే క్రీడలు..**

వాలీబాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహిస్తారు. జిల్లాను ఆరు జోన్లుగా విభజించి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఒక జోన్‌లో మూడు నుంచి నాలుగు మండలాల విద్యార్థులు పోటీ పడనున్నారు. ఇందులో నుంచి మంచి జట్లను ఎంపిక చేసుకొని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

### త్వరలో పూర్తి వివరాలు



కరోనా తర్వాత ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రకటించారు. మాకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పోటీల నిర్వహణపై పూర్తి ప్రణాళిక సిద్ధచేస్తాం. గతంలో మాదిరిగానే ఎస్‌జీఎఫ్ క్రీడలను పకడ్బందీగా నిర్వహిస్తాం. జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలోనే ఈ పోటీలు కొనసాగుతాయి.

– నర్సింలు, ఎస్‌జీఎఫ్, జిల్లా కార్యదర్శి

## క్లుప్తంగా

### వాలీబాల్ టోర్నీ విజేత మంబాపూర్



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న ఎస్‌ఐ, సర్పంచ్

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో మంబాపూర్ జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతి కైవసం చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు రాములు, భాగ్యమ్మ, తమ్ముడు శిరియాల నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మొత్తం 24 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతగా నిలిచిన మంబాపూర్ జట్టుకు రూ. 10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జినుగుర్తి జట్టుకు రూ.5 వేల నగదు బహుమతిని నిర్వాహకుల తరపున ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నమ్మ, ఉప సర్పంచ్ హాశీం, నాయకులు పి. రాములు, శేఖర్, మహేష్, శ్రీధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మహమూద్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీని సోమవారం నగరంలో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో పరిగి పట్టణ కేంద్రంలోని న్యామత్‌నగర్ జరిగే ఇస్తెమా సభలకు హాజరు కావాలని కోరారు. ఇందుకు హోంమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మీర్ మహమ్మద్ అలీ, తాహేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### 22న తాండూరుకు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఈ నెల 22న తాండూరుకు రానున్నట్లు ఆ సమితి జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు రెండో వారం హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ విజయవంతం కోసం తాండూరులో సన్నాహక సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నర్సింహులు, స్వామిదాస్, మహేందర్, ప్రకాష్, వెంకట్, జాను, వెంకటేష్, రాందాస్, చిన్నబాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఇం'డర్'స్ట్రియల్!

- పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు
- కనీస భద్రత చర్యలు కరువు
- ప్రమాదాల బారిన కార్మికులు
- పట్టించుకోని యాజమాన్యాలు
- తాజాగా బ్లైండ్ కలర్ పరిశ్రమలో పేలుడు ఘటనే నిదర్శనం
- చర్యలు తీసుకోవాలంటున్న కార్మిక సంఘాల నేతలు



పరిశ్రమ గేటును తోసుకుంటూ లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

షాద్‌నగర్: వారంతా ఇతర రాష్ట్రాల నుంచి పొట్ట చేత పట్టుకుని వలస వచ్చారు.. స్థానిక పరిశ్రమలను నమ్ముకొని రెక్కల కష్టంతో కడుపు నింపుకొంటున్నారు.. వారి శ్రమతో లాభాలు ఆర్జిస్తున్న యాజమాన్యాలు మాత్రం అడుగడుగునా నిర్లక్ష్యం కనబరుస్తున్నాయి.. భద్రతాప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.. తాజాగా షాద్‌నగర్ పరిధిలోని బ్లైండ్ కలర్స్ పరిశ్రమలో జరిగిన ఘటన మరోసారి యాజమాన్యం నిర్లక్ష్యాన్ని చాటుతోంది. ఈ పరిశ్రమలో కలర్స్ తయారు చేసే యంత్రం పేలిన ఘటనలో పదిమంది మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ ఘటన ఒక్కసారిగా కార్మికుల్లో భయందోళనలు సృష్టించింది. కార్మికుల రక్షణను మరోసారి ప్రశ్నార్థకం చేసింది.

**ఇదీ జరిగింది..**

షాద్‌నగర్ పరిధిలోని కాశిరెడ్డిగూడ శివారులో బ్లైండ్ కలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఆదివారం రాత్రి పరిమితికి మించిన వేడి (ఓవర్ హీట్)తో రంగులు తయారు చేసే యంత్రం పేలడం, అందులో ఉన్న ప్లాస్టిక్‌తో కూడిన ద్రవంలాంటి పదార్థం కార్మికుల మీద పడడం వెనువెంటనే జరిగిపోయాయి. ఊహించని ఈ పరిణామంతో కార్మికులు హాహాకారాలు చేస్తూ బయటికి పరుగులు తీశారు. గాయపడిన 11 మంది కార్మికులను వాహనాల్లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి అటు నుంచి హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ ఆస్పత్రికి తరలించారు. ఒడిశా, బీహార్, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి బతుకుతెరువు వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చిన వలస కార్మికులు ప్రస్తుతం చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

**పరిశ్రమ ఎదుట ఆందోళన**

సోమవారం ఉదయం పరిశ్రమ ఎదుట ఏఐటీయూసీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన నాయకులను సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు గేటు వద్దే నిలువరించారు. దీంతో ఆగ్రహానికి గురైన కార్మిక సంఘాల నేతలు బలవంతంగా గేటు తీసుకొని లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట, వాగ్వాదం చోటు చేసుకున్నాయి. పరిశ్రమ గేటు ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ రంగస్వామి, సీఐ ప్రతాప్ లింగం సందర్శించారు. దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**కనీస జాగ్రత్తలు ఏవీ?**

కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో వందల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. పలు పరిశ్రమల్లో కార్మికుల పరిరక్షణ కోసం కనీస జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదు. యంత్రాల మధ్య పని చేసేవారికి రక్షణ పరికరాలను సమకూర్చడం లేదు. అనుభవం ఉన్న కార్మికులను విధుల్లో పెట్టుకుంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో చాలా పరిశ్రమల్లో అనుభవం లేనివారిని పనిలో పెట్టుకోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాలు జరిగినా సంబంధిత పరిశ్రమల నిర్వాహకులు విషయం బయటకు పొక్కనీయడం లేదు. పరిశ్రమల్లో భద్రతా అధికారి నిత్యం కార్మికుల భద్రతపై అవగాహన కల్పించాల్సి ఉన్నా, ప్రమాదాలను ఎలా నివారించాలన్న అంశంపై తరుచూ ప్రదర్శనలు నిర్వహించాలని నిబంధనలున్నా పాటించిన దాఖలాలు లేవు. పరిశ్రమ శాఖ తరపున తనిఖీలు నిర్వహించడం లేదు.



బ్లైండ్ కలర్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశం ఇదే..

**గతంలో జరిగిన కొన్ని ప్రమాదాలు..**

- 2012లో షాద్‌నగర్ శివారులోని స్టీమ్ కోర్ పరిశ్రమలో బాయిలర్ పేలి 12 మంది కార్మికులు మృతి చెందారు.
- 2015లో కొత్తూరు వినాయక స్టీల్ పరిశ్రమలో ఫర్నస్ పేలి పది మంది మృత్యువాత పడ్డారు.
- తీగాపూర్ శివారులోని పాత టైర్లను కాల్చే పరిశ్రమలో బాయిలర్ పేలి నలుగురు, నందిగామ పరిధిలోని శివశక్తి, జాగృతి, షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో పదిమందికి పైగా కార్మికులు మృతి చెందారు. ఎంతో మంది గాయాలపాలయ్యారు. చిన్నచిన్న పరిశ్రమల్లో అడపాదడపా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

**కార్మికులకు భద్రత కరువు**



పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు భద్రత లేదు. యంత్రాల మధ్య పని చేస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదు. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలి.
– శ్రీను, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

**పరిహారం అందించాలి**



యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పరిశ్రమలో పేలుడు జరిగింది. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు యాజమాన్యం ఒక్కొక్కరికి రూ.50లక్షల చొప్పున పరిహారం అందించాలి.
– రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు

**ప్రమాదం బాధాకరం**



ప్రమాదంలో 11 మంది కార్మికులు తీవ్రంగా గాయపడటం బాధాకరం. పరిహారం చెల్లించడంతోపాటు, వైద్య ఖర్చులు భరించాలి. యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి.
– యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

**దర్యాప్తు చేపడుతున్నాం**



బ్లైండ్ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నాం. పరిశ్రమలో ప్రమాదం ఏవిధంగా జరిగిందన్న కోణంలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.
– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్

### సమస్యల పరిష్కారానికి సహకరించండి

**ఎమ్మెల్సీని కోరిన పంచాయతీ కార్మికులు**

తాండూరు టౌన్: తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని గ్రామ పంచాయితీ కార్మికులు సోమవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిని కలిసి విన్నవించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎమ్మెల్సీ నివాసం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, బకాయిల చెల్లింపు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టామన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జి ల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కార్మికులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగ చోరీ



టేకులపల్లిలో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

మోమిన్‌పేట: రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి అందులోని రాగితీగను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని టేకులపల్లిలో రామయ్య, నగేష్ పొలాల వద్ద ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. వాటిలోని రాగి తీగలను ఎత్తుకెళ్లారు. గతంలో కూడా ఇలాగే రాగి తీగలను ఎత్తుకెళ్లారని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలని రైతులు కోరుతున్నారు.

## చౌడేశ్వరీ మాత సేవలో ఎమ్మెల్యే



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: పట్టణంలోని జులైవాడలో కొలువుదీరిన శ్రీ చౌడేశ్వరీ మాతను సోమవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తొగుట వీర క్షత్రియ సమాజం నూతన భవన నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తొగుట వీర క్షత్రియ సమాజ సభ్యులకు తాను అండగా ఉంటానని అన్నారు. భవిష్యత్‌లో మరింత ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సరోజ, మధుసూదన్‌రావ్ యాదవ్, నాయకులు, భక్తులు శంకర్, బాల్‌రాజ్, మంగలి శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అరక పట్టిన 'ఆనందం'



బార్వాద్ గ్రామ సమీపంలో అరక పడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కాసేపు అరక పట్టారు. ఈ ఘటన కోట్‌పల్లి మండలం బార్వాద్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రాంపూర్ రైతు వేదికలో ఎమ్మెల్యే అన్నదాతలతో సమావేశమయ్యారు. కార్యక్రమం ముగించుకుని మర్పల్లి వైపు బయలుదేరారు. ఈ క్రమంలో బార్వాద్ గ్రామ సమీపంలో ఓ రైతు పొలం పనులు చేయడాన్ని చూసిన ఎమ్మెల్యే కారు ఆపి అక్కడికి వెళ్లారు. కాసేపు రైతులతో మాట్లాడారు. కుటుంబ వివరాలు, ఆర్థిక స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పంట పెట్టుబడి సాయం, ఉచిత విద్యుత్ తదితర వాటిపై ఆరా తీశారు. ఆ తరువాత రైతు వద్ద నుంచి అరక పట్టారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఉన్నారు.

## ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

చేవెళ్ల: గ్రామాల్లో ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని మొహిదిపట్నం డిపో మేనేజర్ జీ.వీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రావులపల్లి, ముడిమ్యాల గ్రామాలకు మెహిదిపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును సోమవారం ప్రారంభించారు. ఈ బస్సు ఏర్పాటుకు ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి, రావులపల్లి సర్పంచ్ కేసారం శ్రీనివాస్‌లు డిపో అధికారుల సూచన మేరకు ముందుగానే రూ.50వేల ఖర్చుతో 1000 బస్సు పాసులు చేయించి బస్సు రోజుకు మూడు ట్రిప్పులు వచ్చేలా కృషి చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు బస్సుల్లో ప్రయాణం చేస్తేనే వాటిని సద్వినియోగం చేసుకున్నట్లు అవుతుందన్నారు. మెహిదిపట్నం నుంచి రావులపల్లి వయా ముడిమ్యాల మీదుగా 447 సీటీ బస్సు వస్తుందని చెప్పారు. తెల్లవారుజామున రైతులకోసం రావులపల్లి నుంచి బస్సు ప్రారంభమై ముడిమ్యాల మీదుగా మెహిదిపట్నం చేరుకుంటుందని, మళ్లీ వెంటనే ఉదయం 8.30గంటలకు గ్రామానికి వస్తుందని అప్పుడు విద్యార్థులు ,ఉద్యోగులు వెళ్లేందుకు ఉపయోగపడుతుందన్నారు. తిరిగి సాయంత్రం 6గంటలకు ఈ బస్సు వస్తుందని చెప్పారు. అలాగే, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం మెహిదిపట్నం బస్సు డిపోకు చెందిన బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయడం జరిగిందన్నారు. రోజు విద్యార్థులు, ఉద్యోగులు ఉదయం, సాయంత్రం సమయంలో వచ్చి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి డిపో అధికారులతో మాట్లాడి బస్సును ఏర్పాటుకు కృషి చేశామన్నారు. డిపో మేనేజర్ సత్యనారాయణను సన్మానించారు. ఎంపీటీసీ స్వరూప, మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు, వార్డు సభ్యులు జైపాల్‌రెడ్డి, దర్శన్, మాధవ్ రెడ్డి, జంగారెడ్డి, శంకర్, యాదగిరి, లక్ష్మయ్య, కృష్ణారెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాంచంద్రయ్య, మోహన్‌రెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటి పైకప్పు కూలి..

**తల్లి, పిల్లలకు గాయాలు**



అంబేద్కర్ నగర్‌లో కూలిన ఇంటి పైకప్పు

తాండూరు టౌన్: పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో గల ఓ ఇంటి పైకప్పు సోమవారం కూలి పోవడంతో తల్లితో సహా ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నర్సింహులు ఇంట్లో నర్సమ్మ ఆమె నలుగురు పిల్లలు ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు తడిసి పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న నరసమ్మ, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కౌన్సిలర్ శోభారాణి కోరారు. పాడుబడిన ఇళ్లల్లో జనాలు ఉండరాదని మున్సిపల్ అధికారులు సూచించారు.

## బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**యువకుడి దుర్మరణం**

మొయినాబాద్: అతివేగంతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఓ యువకుడి ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శిరీష తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, బీరంగూడ ప్రాంతానికి చెందిన వెలగలేటి భాస్కర్(29) ఆర్‌సీపురంలో బేకరీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఉదయం 9గంటల ప్రాంతంలో తన బుల్లెట్ బైక్‌పై మొయినాబాద్ నుంచి మెహదీపట్నం వైపు ప్రయాణిస్తున్నాడు. తాండూరు నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను వేగంగా ఢీ కొట్టింది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడగా భాస్కర్ బస్సు వెనుక చక్రాల కిందపడిపోయాడు. అతని తలపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**మొయినాబాద్ వైపు ఎందుకొచ్చాడు..?**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భాస్కర్ మొయినాబాద్‌కు ఎందుకు వచ్చాడో అంతుచిక్కడంలేదు. ఆర్‌సీపురంలో బేకరీ మేనేజర్‌గా పనిచేసే భాస్కర్ ఆదివారం రాత్రి ఇంటికి రాలేదని... అతనికి ఫోన్‌చేసినా కలవలేదని.. అసలు మొయినాబాద్‌కు ఎందుకొచ్చాడో తమకు తెలియదని కుటుంబ సభ్యులు అన్నారు. ఎవరికీ చెప్పకుండా వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నాడని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

# అభివృద్ధిలో ఉద్దండా'పూర్'

ఓ పక్క పచ్చటి పొలాలు.. మరో పక్క అటవీ ప్రాంతం.. వేసవిలోనూ ఊటీని తలపించే వాతావరణం.. ఇదీ ఉద్దండాపూర్ ప్రత్యేకత.. అయితే గ్రామం తెలంగాణ – కర్ణాటక సరిహద్దులో ఉండడంతో అభివృద్ధి మచ్చుకైనా కనిపించడం లేదు. అరకొరగా వచ్చే పంచాయతీ నిధులే గ్రామాభివృద్ధికి దిక్కవుతున్నాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్లే మా బతుకుల్లో వెలుగులు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేని గ్రామం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వైనం
- ఏడాదికి ఒక్కసారి కూడా రాని పాలకులు, అధికారులు
- అటవీ ప్రాంతంలో గ్రామం ఉండడమే కారణం



అభివృద్ధికి నోచుకోని ఉద్దండాపూర్

తాండూరు రూరల్: తాండూరు పట్టణానికి 18కిలోమీటర్ల దూరంలో ఉద్దండాపూర్ గ్రామం ఉంది. ఈ ఊరిలో 1,300 మంది జనాభా, 800వందల వరకు ఓటర్లు ఉన్నారు. గ్రామం నుంచి కర్ణాటక రాష్ట్రం కేవలం కిలోమీటరు దూరంలో మాత్రమే ఉంది. గ్రామంలో సగం మంది కన్నడ భాషనే మాట్లాడతారు. ఇక్కడ అందరూ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. తాండూరు మండలంలోని ఉద్దండాపూర్ అభివృద్ధిని పాలకులు, అధికారులు విస్మరించారు. మురుగు కాలువలు నిర్మించలేదు. మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. మురుగు వీధుల్లో ప్రవహిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అంతంతమాత్రంగానే అమలవుతున్నాయి. గ్రామంలో పెంకుటిళ్లు, గుడిసెలే ఎక్కువగా కనిపిస్తాయి. సాంకేతికంగా దేశం ఎంతో అభివృద్ధి చెందుతున్నా.. నేటికీ ఈ గ్రామంలో సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో పింఛను పొందలేక పోతున్నారు. పక్క గ్రామానికి వెళ్లి పింఛను డబ్బు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో ప్రభుత్వ భూమి లేకపోవడం కూడా అభివృద్ధికి అడ్డుగా మారింది. ఏ పని ప్రారంభించాలన్నా స్థల సమస్య ఎదురవుతోంది. మా గ్రామానికి ఇప్పటి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**నాటి రాయిపల్లే.. నేటి ఉద్దండాపూర్**

రాయిపల్లి కాలక్రమేనా ఉద్దండాపూర్‌గా మారింది. ఈ గ్రామ పరిధిలో గుండ్లమడుగు తండా, మైసమ్మ తండాలు ఉండేవి. 2018లో వాటికి ప్రభుత్వం పంచాయతీ హోదా ఇచ్చింది.

**నిధులు లేక సాగని అభివృద్ధి**

ఉద్దండాపూర్ చిన్న పంచాయతీ.. ఈ జీపీకి ఎలాంటి ఆదాయ వనరులు లేవు. పన్నుల రూపంలో రూ. 10వేలు కూడా రావు. కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులే శరణ్యం. గ్రామం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో పాలకులు, అధికారులు తమను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి ఇప్పటి వరకు ఒక్క జిల్లాస్థాయి అధికారి కూడా రాలేదని వాపోతున్నారు. ఏడాదికి ఒక్కసారి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చుట్టపుచూపులా వచ్చి వెళుతుంటారని తెలిపారు. వారి వచ్చినా గ్రామానికి ఒరిగేది ఏమీ ఉండదని తెలిపారు. అరకొరగా వచ్చే నిధులతోనే అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీ నిధులు వచ్చిన దాఖలాలే లేవని పేర్కొన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూమి లేదని, చుట్టూ పట్టా పొలాలు, ఫారెస్ట్ భూములే ఉన్నట్లు తెలిపారు. శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్, క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం కూడా అటవీ భూమిలో ఏర్పాటు చేశారు. ఇవి కూడా గ్రామానికి చాలా దూరంగా ఉన్నాయి. ప్రతి రోజూ గ్రామం నుంచి సేకరించే చెత్తను ఐదు కిలో మీటర్ల దూరంలోని డంపింగ్ యార్డుకు తరలించాల్సి వస్తోందని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో జినుగుర్తి గ్రామానికి వెళ్లి ప్రతి నెలా పింఛన్లు తీసుకోవాల్సి వస్తోందని లబ్ధిదారులు తెలిపారు. వృద్ధులు జినుగుర్తి గ్రామానికి వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు.



సీసీ రోడ్డు, మురుగు కాలువ లేని ఓ కాలనీ

**గ్రామాభివృద్ధికి సహకరించండి**



మా ఊరు తెలంగాణ – కర్ణాటక సరిహద్దులో ఉంటుంది. ఎన్నికల నెల రోజుల మాత్రమే గ్రామంలో హడావుడి ఉంటుంది. ఆ తర్వాత పార్టీలకు అతీతంగా గ్రామంలో అందరం అన్నదమ్ముళ్ల కలిసి మెలసి ఉంటాం. ప్రతి నెలా జీపీకి వచ్చే నిధులు సరిపోవడం లేదు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చొరవ తీసుకొని మా గ్రామానికి నిధులు వచ్చేలా చూడాలి. గ్రామాభివృద్ధికి సహకరించాలి.
– నర్సింలు, ఉద్దండాపూర్